క్లుప్తంగా

దత్తాత్రేయునికి విశేష పూజలు


దత్తాత్రేయ స్వామి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో ఉపాలయమైన దత్తాత్రేయ స్వామి వారికి గురువారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో ఉన్న మానవత కమ్యూనిటీ హాల్ రోడ్డుకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి జెడ్పీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. వీటితో చేపట్టే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి బాబ్జి గురువారం శంకుస్థాపన చేశారు. మానవత మండల అధ్యక్షులు అయినాల రమణమూర్తి, నూతన అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, పరిమి సత్తిపండు పాల్గొన్నారు.

బెడ్, వీల్‌చైర్ అందజేత


పేషెంట్ బెడ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురంలోని వెల్‌నెస్ హెల్త్ సెంటర్‌కు పేషెంట్ బెడ్, వీల్‌చైర్ సమకూరాయి. గ్రామ పంచాయతీ ద్వారా వీటిని అందజేయగా, రోగుల సౌకర్యార్థం గురువారం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధికలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వెల్ నెస్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం


సత్యవతి కుటుంబసభ్యులకు సాయం అందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: పేద కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. తెడ్లం గ్రామంలో ఇటీవల కొమ్మంటి సత్యవతి అనారోగ్యంతో మృతి చెందింది. పేదకుటుంబం కావడంతో సత్యవతి కుటుంబానికి కేతిరెడ్డి సీతారామిరెడ్డి, చంద్రకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు), తెడ్లం సర్పంచ్ ముప్పన స్రవంతి రమేష్ రెడ్డిలు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు.

వేసవి విజ్ఞాన తరగతులు


వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థులు

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సీహెచ్‌వీ రమణ తెలిపారు. గురువారం విద్యార్థులకు తెనాలి రామకృష్ణ కథను వివరించామన్నారు. జనరల్ నాలెడ్జ్ క్విజ్, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, గేమ్స్ ఆడించామని తెలిపారు. కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఆరోగ్య జీవనానికి యోగా దోహదం


యోగా చేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు

బుట్టాయగూడెం: ఆరోగ్యకరమైన జీవనానికి యోగా దోహదపడుతుందని మండల స్థాయి యోగా ట్రైనర్స్ కె.రామలక్ష్మి, జలగం చిన్ను తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. యోగా మనసును ప్రశాంతంగా ఉంచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, ఏకాగ్రతను మెరుగుపరచడానికి సహాయపడుతుందని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు సేవలకు చెల్లు

- వలంటీర్ల వ్యవస్థ రద్దు
- ఇంటింటికీ రేషన్ సరఫరా రద్దు
- కూటమి పాలనలో లబ్ధిదారులకు పాట్లు

బుట్టాయగూడెం / చింతలపూడి : గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన గడప గడపకు పాలనకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. సుపరిపాలనకు తిలోదకాలు ఇచ్చి స్వపరిపాలనకు పెద్దపీట వేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం దళారీ వ్యవస్థ కట్టడికి వలంటీర్, సచివాలయం, ఎండీయూ (ఇంటింటికి రేషన్ సరఫరా), ఫ్యామిలీ డాక్టర్, రైతు భరోసా, రైతులకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేసింది. ఈ వ్యవస్థల రద్దు, నిర్వీర్యంతో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వృద్ధులు, వికలాంగులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పథకాల కోసం ప్రజలు కాళ్లు అరిగేలా అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది.

సేవలకు వలంటీర్లు దూరం

వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో పోలవరం నియోజకవర్గంలో సుమారు 1772 మంది వలంటీర్లు రోడ్డున పడ్డారు. చింతలపూడి నియోజకవర్గంలో రూ.35.6 కోట్లతో 89 సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించారు. ఈ సచివాలయాల్లో 709 మంది ఉద్యోగులు, 1,330 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందించేవారు. వీరిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధుల నుంచి తొలగించింది.

రోడ్డున పడనున్న ఎండీయూ వాహన సిబ్బంది

ఎండీయూ వాహనం ద్వారా 1000 నుంచి 2000 కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు వాహనాలు ఇంటింటికీ తిరిగి రేషన్ అందిస్తూ వచ్చాయి. రేషన్ పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం మళ్లీ పాత రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి రేషన్ డిపోల్లోనే క్యూ కట్టి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. పోలవరం నియోజకవర్గంలో ఎండీయూ వాహనాల్లో పనిచేసే సుమారు 70 కుటుంబాల వారు రోడ్డున పడనున్నాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో మైళ్లదూరం తలపై బియ్యం మూట పెట్టుకుని నడిచే కష్టాలు ప్రారంభం కానున్నాయి.

సంక్షేమంపై నిఘా

వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను గడపగడపకు అందజేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ ఆరా తీసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం ఏడు మండలాల పరిధిలోని 107 సచివాలయాల పరిధిలో సుమారు 1,90,555 గడపలు తిరిగి సంక్షేమ పథకాల అమలుపై నాటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతోపాటు అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా ఆరా తీశారు.


బుట్టాయగూడెం : దొరమామిడి సమీపంలోని సరుగుడులో పథకాలపై ఆరా తీస్తున్న బాలరాజు (ఫైల్)


బుట్టాయగూడెం : రేపల్లె వృద్ధులకు పింఛన్లు అందిస్తున్న వలంటీర్ (ఫైల్)


చింతలపూడి : కొణిజర్ల గ్రామంలో రేషన్ అందిస్తున్న దృశ్యం (ఫైల్)

వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యం



ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఎనలేని సేవ చేసే వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం తగదు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థను పూర్తిగా పక్కన పెట్టడం సరైన విధానం కాదు. దీని వల్ల వేల కుటుంబాలు వీధిన పడ్డాయి.

– తెల్లం రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పోలవరం సమన్వయ కర్త, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

హామీలన్నీ మోసపూరితం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ వలంటరీ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాల లబ్ధిని అందించారు. ఇచ్చిన హామీలను ఏడాదిలోపే అమలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమే. వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోంది.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ కన్వీనర్, చింతలపూడి నియోజకవర్గం

జగన్ హయాంలోనే బాగు



వైఎస్ జగన్ హయాంలో ఇళ్ల వద్దకే వచ్చి వాహనం ద్వారా బియ్యం అందించే వారు. నాకు 65 ఏళ్లు. నేను ఇప్పుడు రేషన్ షాపునకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే ఇబ్బందులు తప్పవు. ఇప్పుడు నేను బియ్యం తీసుకోవడం ఎలా, జగన్ ప్రభుత్వంలోనే చాలా బాగుంది. మాలాంటి వృద్ధులు నడిచి అంత దూరం రేషన్ షాప్ దగ్గరకు వెళ్లి బియ్యం తెచ్చుకోలేం.

– వై.సావిత్రి, కొణిజర్ల, లింగపాలెం మండలం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేలేరుపాడు: చెట్ల కొమ్మల నరికివేత నిమిత్తం ఈనెల 20వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, రాజీవ్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో..

లింగపాలెం: ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ధర్మాజీగూడెం, కాటమరెడ్డిపల్లి, కొణిజర్ల, మఠంగూడెం, టీసీహెచ్‌ఆర్ పాలెం, అయ్యప్పరాజుగూడెం, కలరాయనగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల పరిశీలన

బుట్టాయగూడెం: మండలంలోని సీతప్పగూడెం, అంతర్వేదిగూడెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను గురువారం క్వాలిటీ కంట్రోల్ సెల్ అధికారులు పరిశీలించారు. ఆ శాఖ అధికారి మణికంఠ మండలంలోని అంతర్వేదిగూడెం, సీతప్పగూడెం పంచాయతీ పరిధి గ్రామాల్లో ఫారమ్ ఫండ్స్ పనులను పరిశీలించారు.

జూదరుల అరెస్ట్

చింతలపూడి : మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కుటుంబరావు తెలిపారు. రూ.65,500 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ముగ్గురు అరెస్టు

టి.నరసాపురం: మండలంలోని బండివారిగూడెంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్సై ఎం జయబాబు తెలిపారు. వారి నుంచి రూ.2130 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

దొరసానిపాడులో తాటాకిల్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్రామానికి చెందిన మిడతా రమేష్ ఇంటికి నిప్పంటుకుంది. మంటలు వ్యాపించడంతో స్థానికులు సకాలంలో వాటిని ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి దగ్ధమయ్యాయి.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

కొయ్యలగూడెం: అర్హులందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 2న నిర్వహించే ధర్నా పోస్టర్‌ను గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. వెలగల నాని, మట్ట రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి నిధులు

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల అభివృద్ధికి, తూముల మరమ్మతులకు రూ.48 లక్షలు మంజూరయినట్టు పీడబ్ల్యూడీ అప్‌ల్యాండ్ సబ్ డివిజన్ బందకట్టు సెక్షన్ ఏఈ భాస్కర్ గురువారం తెలిపారు. పోలవరం కడెమ్మ కాలువ పనులకు రూ.5 లక్షలు, బుట్టాయిగూడెం మండలం జల్లేరు రిజర్వాయర్, అలివేరు ప్రాజెక్టులకు రూ.10 లక్షల చొప్పున, కొయ్యలగూడెం మండలం శ్రీరాములు కట్టు చెరువు అభివృద్ధికి, వేదాంతపురం ఎర్ర చెరువుకు రూ.3 లక్షలు చొప్పున, కన్నాపురం (కంద్రిక గూడెం) సీతయ్య కట్టు చెరువుకు, దిప్పకాయలపాడు రాజు చెరువులకు రూ.4 లక్షలు చొప్పున, (కిచప్ప గూడెం) భీముడు చెరువు, జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెం నందనాల ట్యాంక్, కొయ్యలగూడెం మండలం సరిపల్లి హుకుంపేట చెరువులకు రూ.3 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు


జంగారెడ్డిగూడెంలోని థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినోదాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి థియేటర్ యాజమాన్యానికి ఉందని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని థియేటర్‌లను ఆయన గురువారం తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు మేరకు సినిమా థియేటర్లు తనిఖీ చేశామని తహసీల్దార్ తెలిపారు. వసతులు, టిక్కెట్ ధరలు, లైసెన్స్ తదితర విషయాలను పరిశీలించామన్నారు. కొన్ని థియేటర్‌లలో అగ్నిమాపక పరికరాలు లేవని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించామని తెలిపారు. క్యాంటీన్‌లో, టిక్కెట్ అధిక ధరలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ప్రేక్షకునికి థియేటర్‌లోని సీటింగ్‌తో పాటు, టాయిలెట్ వంటి సౌకర్యలు సక్రమంగా ఉండాలన్నారు. షో ముగిసిన వెంటనే టాయిలెట్‌లను శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. టిక్కెట్‌ల విక్రయాల్లో బ్లాక్ మార్కెటింగ్ లేకుండా కౌంటర్‌లో లేదా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రేక్షకులు థియేటర్‌లో సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో డీటీ రమేష్, వీఆర్‌ఓలు సురేష్, బాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత సౌకర్యాలు కల్పించాలి


పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: వినియోగదారులకు నిర్దేశించిన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్‌లలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పటి శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి వాహనానికి ఉచితంగా గాలి పట్టాలని, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పటికప్పుడు బోర్డు ద్వారా వినియోగదారులకు ప్రదర్శించాలన్నారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతగా నిర్దేశించి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ప్రతి నెలా అధికారులు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేస్తారని తెలిపారు.

1 నుంచి చౌక డిపోల వద్దే రేషన్ పంపిణీ

ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించి పాత పద్ధతిలోనే జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు నిత్యావసరాలు అందించాలని తహసీల్దార్ రేషన్ డీలర్‌లను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాప్ వద్ద సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాప్ వద్ద సరుకు వివరాలు, నిత్యావసర సరుకుల ధరలు, నిల్వల వివరాలు పట్టికలో పొందుపర్చాలని అన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు, పెట్రోల్ బంక్ యాజమాన్యాలు, రేషన్ షాప్ డీలర్స్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో భూముల పరిశీలన


మాట్లాడుతున్న ఆర్‌డీఓ, స్పెషల్ కలెక్టర్

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకు గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం, కూనవరం మండలాల పరిధిలోని నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం మండలంలో అనువైన భూములను పరిశీలిస్తున్నామని ఆర్‌డీఓ ఎంవీ రమణ, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనంలు తెలిపారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామంలో నిర్వాసితుల కోసం సేకరించిన భూములను పరిశీలించారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పునరావాస కాలనీల నిర్మాణానికి సుమారు 600 ఎకరాలకు పైగా భూములు అవసరం కాగా ప్రస్తుతం 300 ఎకరాల వరకు పరిశీలించామని తెలిపారు. నిర్వాసితులను ఆయా భూములకు తీసుకువచ్చి, వారి ఆమోదంతోనే వాటికి సేకరించామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ చలపతి రావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి


న్యాయసేవలపై సమీక్షిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానల్ లాయర్లు విచారణ జరిగే కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు భరోసాను ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు రత్నప్రసాదు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదుల ద్వారా వాదించే ఉచిత న్యాయ సేవలపై గురువారం సమీక్షించారు. అధికారులు సమన్వయంతో ఉచిత లీగల్ ఎయిడ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవల పైన ప్రచారం చేయాలని అనానరు. జూలై 05న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు, ప్యానల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

కాలం చెల్లిన పానీయాల విక్రయం


దిప్పకాయలపాడులో ఇటీవల గుర్తించిన కాలం చెల్లిన పానీయాలు (ఫైల్)

కొయ్యలగూడెం: కాలం చెల్లిన పానీయాలను విక్రయిస్తూ దుకాణదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లోనూ కాలం చెల్లిన పానీయాలను స్టోరేజ్ చేసి షాపుల్లో విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు రెండున్నరేళ్ల క్రితం నుంచి సంవత్సరం క్రితం వరకు నిల్వ ఉంచిన శీతల పానీయాలను విక్రయించేస్తున్నారు. ఇటీవల దిప్పకాయలపాడు గ్రామంలో కాలంచెల్లిన పానీయాలను భారీ స్థాయిలో నిల్వచేసి ఉండడాన్ని గుర్తించి స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. తాజాగా కన్నాపురం గ్రామంలోని పలు దుకాణాలలో కాలం చెల్లిన పానీయాలను గుర్తించి వినియోగదారులు షాపుల యజమానులను నిలదీశారు. పెద్దల జోక్యంతో వ్యవహారం సర్దుబాటు చేసినప్పటికీ శీతల పానీయాలను సేవించిన కొద్ది రోజులకు అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. బయ్యన్నగూడెం గ్రామంలోని ఓ కిరణా షాప్‌లో కూడా నిల్వచేసి ఉంచిన పానీయాలను గుర్తించిన వ్యక్తులు హంగామా చేసి దుకాణదారునితో లాలూచీపడి సొమ్ములు దండుకున్నట్టు తెలిసింది. శీతల పానీయాలు నిలువ చేసి ఉంచిన షాపులపై ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని ప్రధాన పంచాయతీలలోనే కాలంచెల్లిన పానీయాలు విక్రయించే దుర్భరస్థితి ఉండగా మారుమూల ప్రాంతాలలో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు వాపోతున్నారు. వీధివీధినా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ఉండడంతో కాలం చెల్లిన పానీయాలను ప్రధాన షాపుల యజమానులు సరఫరా చేసినట్టు తెలిసింది. మందుబాబులకి పెద్దగా అవగాహన ఉండకపోవడం కూడా బెల్ట్ షాపుల నిర్వాహకులకు కలిసి వచ్చిందని చెబుతున్నారు. కన్నాపురంలోని కొన్ని షాపుల నుంచి ఏజెన్సీ గ్రామాలకు కాలం చెల్లిన పానీయాలను సరఫరా చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు నివాళి


కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్మలా కిషోర్

బుట్టాయగూడెం: మండలంలోని కంద్రికగూడెం సాయిబాబా మందిర ఆవరణలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పుణ్యశ్లోక అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్, రాజమండ్రి బీజేపీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ అనురాధ మాట్లాడుతూ వీరమహిళ అహల్యాబాయి హోల్కర్ 18వ శతాబ్దంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్‌ఆర్‌ఆర్‌పి సుభద్ర, వంకా కాంచనమాల, కొండేపాటి రామకృష్ణ, దయ్యాల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి

కుక్కునూరు: ప్రజా పంపిణీ వ్యవస్థలో వినియోగదారుల ఇంటికే నేరుగా సరుకులు సరఫరా చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు (ఎండీయూ)లను జూన్ 1 నుంచి నిలిపేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, ఆపరేటర్లు, అసిస్టెంట్లను కొనసాగించాలని సీఐటీయూ కుక్కునూరు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో సాయికిరణ్ మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉన్న మొబైల్ వ్యవస్థను కొనసాగించాలన్నారు. తాము అధికారంలోకొస్తే ఎవరినీ ఉద్యోగాల నుంచి తొలగించబోమని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు.

హామీల అమలులో విఫలం

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ ఆరోపించారు. గురువారం స్థానిక చర్చి స్కూల్ ఆవరణంలో సీపీఐ కుక్కునూరు మండల 16వ మహాసభ నిర్వహించారు. వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు 45 కాంటూరు లెవల్‌లో నిర్మిస్తేనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా తీసుకొని ప్రతి నిర్వాసితుడికీ ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, గిరిజన సంఘం అధ్యక్షుడు వరసా పాపారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత కుక్కునూరు పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు.